క్లుప్తంగా

నేడు విద్యుత్‌కు అంతరాయం

జనగామ: పట్టణంలోని గ్రేయిన్ మార్కెట్ ఏరియా 33/11కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని వీవర్స్ కాలనీ, గ్రేయిన్ మార్కెట్, గీత నగర్, వికాస్ నగర్, గిర్నిగడ్డ, బాణాపురం, ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి ఏరియాలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని ఏఈ సౌమ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సబ్ స్టేషన్‌లో మెయింటనెన్స్‌లో భాగంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలన్నారు.

కాంగ్రెస్ పటిష్టతకు తోడ్పాటు


ధన్వంతి

దేవరుప్పుల: అధిష్టానం సూచనల మేరకు కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం తోడ్పాటు అందిస్తామని నిర్మల్ జిల్లా పీసీసీ పరిశీలకురాలుగా నియమితులైన వరంగల్ ఉమ్మడి జిల్లా మాజీ జెడ్పీచైర్‌పర్సన్ లకావత్ ధన్వంతి లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ మహిళా సాధికారత దిశకు కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రాధాన్యం ఇచ్చే క్రమంలో రాజకీయ ప్రాధాన్యం కల్పించే దిశలో పీసీసీ తనకు పరిశీలకురాలుగా బాధ్యతలు అప్పగించడం పట్ల సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

పరామర్శ



జనగామ: ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తండ్రి సిద్దిపేట జిల్లా చిన్న కోడూరు మండలం గంగాపూర్ గ్రామంలో ఇటీవల మృతి చెందారు. కాగా, శుక్రవారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించి శ్రీనివాస్‌ను ఓదార్చారు.

యుగంధర్ కుటుంబానికి..



రఘునాథపల్లి: మండలగూడెం గ్రామానికి చెందిన గాదె యుగంధర్ (28) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్ కాగా పుట్టెడు దుఃఖంలో ఉన్నా తల్లిదండ్రులు ఆరుగురికి అవయవదానం చేసిన విషయం విదితమే. సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి మండలగూడెం చేరుకొని యుగంధర్ చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. శోకసంద్రలో ఉన్న మృతుడి తల్లిదండ్రులు గాదె మురళీధర్–భలను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

నివాళి



జనగామ: జిల్లా కేంద్రంలోని 29వ వార్డు అధ్యక్షుడు ఎండీ అర్షద్(42) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న డీసీసీ అధ్యక్షుడు, జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అర్షద్ నివాసానికి చేరుకుని మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. అనంతరం యువ, పార్టీ రాష్ట్ర నాయకుడు కొమ్మూర ప్రశాంత్‌రెడ్డి నివాళులర్పించిన అనంతరం, కుటుంబ సభ్యులను పరామర్శించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. పరామర్శించిన వారిలో ఏఎంసీ చైర్మన్ బనుక శివరాజ్‌యాదవ్, పట్టణ అధ్యక్షులు చెంచారపు బుచ్చిరెడ్డి, కరుణాక ర్‌రెడ్డి, జమాల్‌షరీఫ్ తదితరులు ఉన్నారు.

బండనాగారంలో..

బచ్చన్నపేట: బండనాగారం గ్రామంలో ఇటీవల మృతి చెందిన చల్ల నర్సిరెడ్డి కుటుంబ సభ్యులను డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పరామర్శించారు. శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నియామకం

నర్మెట: బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా గుండేటి రామచందర్ నియమితులయ్యారు. బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఆర్. కృష్ణయ్య, జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, రవికృష్ణ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు దూడల సిద్దయ్య నియామక పత్రాన్ని శుక్రవారం అందజేశారు.

పీఆర్‌టీయూ మండల కార్యవర్గం ఎన్నిక

దేవరుప్పుల : ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ మండల శాఖ నూతన అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులుగా గోలి తిరుపతి రెడ్డి, ఓడపల్లి ప్రవీణ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కొల్ల మహిపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం సింగరాజుపల్లిలో ప్రస్తుత అధ్యక్షుడు అంబటి అంజయ్య అధ్యక్షతన ఎన్నిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కేవలం పీఆర్‌టీయూ కార్యాచరణ ఉద్యమంతోనే సాధ్యమని, పాత పెన్షన్ పునరుద్ధరణ, పెండింగ్ డీఏ, ఆరోగ్య కార్డుల జారీ కోసం పాటుపడుతామన్నారు. అనంతరం పదోన్నతిపై వెళ్లిన అంబటి అంజయ్యను సన్మానించారు.

ఏళ్ల తరబడి..

మరమ్మతుకు నోచుకోని బంజరు కాల్వ

- సాగునీటికి రైతుల అవస్థలు
- వెయ్యి ఎకరాలకు కటకట
- పట్టించుకోని పాలకులు, అధికారులు


బంజరుకాల్వలో అడ్డంగా పెరిగిన పిచ్చిచెట్లు


పాంనూర్‌లోని బంజరుకాల్వ

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలో పాంనూర్ గ్రామంలోని బంజరుకాల్వ దశాబ్దాలుగా మరమ్మతుకు నోచుకోకపోవడంతో సాగునీటి కోసం రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారుతుంది. బంజరుకాల్వకు పూర్తిస్థాయిలో శాశ్వత మరమ్మతు పనులు చేపట్టి సాగునీరు అందించాలని గ్రామానికి చెందిన రైతులు కోరుతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. పాంనూర్ గ్రామ శివారులోని బంజరుకాల్వ శిథిలం కాగా పూడుకుపోయింది. కాల్వ శిథిలం కావడంతో పాటు కాల్వలో విపరీతంగా పిచ్చిమొక్కలు పెరిగాయి. దాంతో కాల్వ పూర్తిగా పూడుకుపోయి బంజరుకాల్వ ద్వారా నీరు ముందుకు వెళ్లడం లేదు. ఘన్‌పూర్ రిజర్వాయర్ పూర్తయి అక్కడి నుంచి దాదాపు 18ఏళ్ళుగా సాగునీరు వస్తున్నా బంజరుకాల్వ శిథిలమై పూడుకుపోవడంతో రైతులకు సాగునీరు రావడం లేదు. బంజరుకాల్వను మరమ్మతు చేసి వినియోగంలోకి తీసుకువస్తే మొత్తంగా వెయ్యి ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఇందులో 550 ఎకరాలు పాంనూర్, 250 ఎకరాలు చిల్పూరు మండలం నష్కల్, 250 ఎకరాలు జఫర్‌గఢ్ మండలం ఉప్పుగల్లు గ్రామాలకు సాగునీరు అందుతుంది.

కాల్వకు పలుచోట్ల గండ్లు

దాదాపు 80 ఏళ్ల క్రితం గ్రామంలో నిర్మాణం చేపట్టిన బంజరుకాల్వకు పలు చోట్ల గండ్లు పడటం, తుమ్మచెట్లు, పిచ్చిచెట్లు పెరిగి కాల్వలు పూర్తిగా పూడ్చుకుపోవడంతో రైతులకు సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. విపరీతంగా పిచ్చిమొక్కలు పెరగడంతో ఘన్‌పూర్ రిజర్వాయర్ నుంచి తూము ద్వారా వచ్చే నీరు వాగుపాలు అవుతుంది. కాల్వ పునరుద్దరణ పనులు చేపట్టాలని పలుమార్లు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని రైతులు వాపోతున్నారు. కాల్వ పునరుద్దరణ పనులు చేస్తే పాంనూర్‌తో నష్కల్, ఉప్పుగల్లు గ్రామాలకు సాగునీరు అందుతుంది.

80 ఏళ్ల క్రితం బంజరుకాల్వ నిర్మాణం

గ్రామానికి చెందిన బాబుదొర అనే సాంకేతిక నిపుణుడు దాదాపు 80 ఏళ్ల క్రితం వరద ప్రవాహం ద్వారా వచ్చే నీళ్లను ఎలాగైనా ఆపి గ్రామ రైతాంగానికి రెండు పంటలకు సాగునీరు అందించే సంకల్పంతో ఆరోజుల్లో బంజరు కాల్వ, పర్రె కాల్వల నిర్మాణం చేశారని రైతులు చెబుతున్నారు.గతంలో పాంనూర్ గ్రామ రైతాంగానికి సాగునీరు సమృద్ధిగా ఉండేదని, ఇక్కడ నుంచి దిగువన ఉన్న జఫర్‌గడ్ మండలం ఉప్పుగల్లుకు సాగునీరు వెళ్లేవని రైతులు చెపుతున్నారు. కాలక్రమంలో బంజరుకాల్వ, పర్రె కాల్వలకు పలు చోట్ల గండిపడటం, కాల్వలలో పిచ్చిచెట్లు ఏపుగా పెరిగి నీళ్ల దిగువ ప్రాంతానికి అందడం లేదు. తలాపున గోదావరిలా ఘన్‌పూర్ రిజర్వాయర్‌లో సమృద్ధిగా నీరు ఉన్నా బంజరు కాల్వ, పర్రెకాల్వకు గండ్లు ఏర్పడి, పిచ్చి మొక్కలు పెరిగి నీరందక పంటలు ఎండిపోయే దుస్థితి నెలకొంది. ప్రభుత్వాలు, పాలకులు మారినా పాంనూర్ గ్రామ రైతుల తలరాతలు మారడం లేదని, గ్రామానికి వచ్చే ఎమ్మెల్యేలు, మంత్రులు బంజరుకాల్వపై ఎన్ని హామీలు చేసినా ఆచరణకు నోచుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. నాటి టీడీపీ ప్రభుత్వ హయాం నుంచి ప్రస్తుత కాంగ్రెస్ పాలన వరకు పరిస్థితి అలాగే ఉందని వాపోయారు. సాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి చూపే స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి బంజరుకాల్వ సమస్యను పరిష్కరించాలని అన్నదాతలు కోరుతున్నారు.

శాశ్వత ప్రాతిపదికన..



బంజరుకాల్వకు శాశ్వత ప్రాతిపదికన మరమ్మతు చేయాలి. ఈవిషయమై పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఏళ్లతరబడి ఎదురు చూస్తున్నా ఫలితం లేదు. ఇప్పటికైనా స్పందించి కాల్వకు శాశ్వత మరమ్మతు చేయాలి.

–ఒగ్గు రాజు, రైతు

తీరని సమస్యగా బంజరు కాల్వ



బంజరుకాల్వ రైతులకు తీరని సమస్యగా మారింది. ప్రభుత్వాలు మారినా సమస్య పరిష్కారం కావడం లేదు. కాల్వకు శాశ్వత మరమ్మతు చేస్తే రైతులకు రెండు పంటలకు సరిపడా సమృద్ధిగా సాగునీరు అందుతుంది. పాంనూర్‌తో పాటు నష్కల్, ఉప్పుగల్లు రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది.

–పొన్న బీరయ్య, రైతు

సమాచార హక్కు చట్టంపై అవగాహన తప్పనిసరి

- ఆర్డీఓ డీఎస్ వెంకన్న


మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకన్న

స్టేషన్‌ఘన్‌పూర్: సమాచార హక్కు చట్టంపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓ డీఎస్ వెంకన్న అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం–2005 వేడుకలను డివిజన్ పరిధిలోని వివిధ శాఖల అధికారులతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఆర్డీఓ మాట్లాడారు. సమాచార హక్కు చట్టంపై ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

సమాచారహక్కు చట్టాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వెంకటేశ్వర్లు అన్నారు. ఘన్‌పూర్ రెవెన్యూశాఖ వారి ఆధ్వర్యంలో మండలస్థాయి సమాచారహక్కు దినోత్సవ వేడుకలను స్థానిక రైతువేదికలో నిర్వహించారు. ఎస్సై వినయ్‌కుమార్, డీటీ సంధ్యారాణి, ఆర్‌ఐలు కె.శ్రీకాంత్, సతీష్, మున్సిపల్ కమిషనర్ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యం


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీఓ

జనగామ రూరల్: రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని డీసీఓ కోదండరామ్ అన్నారు. శుక్రవారం మండలంలోని అడవికేశావాపూర్ గ్రామంలో పీఏసీఎస్ చీటకోడూరు ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించి ఆర్థికంగా రైతులను ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ప్రారంభిస్తోందన్నారు. పండిన ధాన్యాన్ని నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకురాకుండా తేమ శాతం వచ్చాకే రావాలని సూచించారు. ప్రతీగింజను కొనుగోలు చేస్తామని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. చీటకోడూర్ పీఏసీఎస్ సీఈఓ భాస్కర్‌రెడ్డి, గ్రామస్తులు రాంకోటి, రైతులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో మెగా హోమియో వైద్యశిబిరం


వైద్యశిబిరంలో పాల్గొన్న డాక్టర్లు

జనగామ: పట్టణంలోని అర్బన్ పీహెచ్‌సీలో జేఎస్‌పీఎస్ హోమియో వైద్య కళాశాల, ప్రభుత్వ హోమియోపతి దవాఖానాతో పాటు రామంతాపూర్‌కు చెందిన వైద్యుల పర్యవేక్షణలో శుక్రవారం మెగా హోమియోపతి వైద్య శిబిరం నిర్వహించారు. కాలనీ ప్రజలతో పాటు మహాత్మా జ్యోతిబాపూలే గురుకులానికి చెందిన 200 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్లు మాధవి, శ్రీకాంత్, నిఖిల్, సంజన, నేహా, ప్రోగ్రాం ఆఫీసర్ అశోక్ కుమార్, వైద్యులు కమలహాసన్, అనురాధ, శ్రీతేజ, డీపీఎం కుమార్ ఉన్నారు.

బాలికల్లో మానసిక స్థైర్యాన్ని పెంపొందించాలి

జనగామ రూరల్: బాలికల్లో మానసిక స్థైర్యాన్ని పెంపొందించాలని ఏబీవీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కళాశాల మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో కళాశాలలో అంతర్జాతీయ బాలికా, ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు. డాక్టర్ బి.ఎస్. సురేఖ, డాక్టర్ టి. కళ్యాణి బోధనా, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల పేరిట కాంగ్రెస్ డ్రామా

- మాజీ మంత్రి దయాకర్‌రావు


దేవరుప్పుల: మాట్లాడుతున్న ఎర్రబెల్లి

దేవరుప్పుల: మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సకాలంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించలేక బీసీ రిజర్వేషన్ల పేరిట డ్రామాలాడుతోందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దయాకర్, రవి, సోమయ్య, సాయిలు పాల్గొన్నారు.

42 శాతం రిజర్వేషన్లతో ఎన్నికలు చేపట్టాలి

పాలకుర్తి టౌన్: కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీని నిలబెట్టుకొని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ సామాజిక వర్గానికి 42 శాతం రిజర్వేషన్లతోనే ఎన్నిలకలు నిర్వహించాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, మాజీ ఎంపీపీ నల్లా నాగిరెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

జఫర్‌గఢ్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లు కాంగ్రెస్ డ్రామా ఆడుతోందని బీఆర్‌ఎస్ బీసీ సెల్ మండల కోఆర్డినేటర్ కోత్వాల కుమార్ విమర్శించారు. మండల కేంద్రంలో గ్రామ అధ్యక్షుడు శ్రీధర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కుమార్ మాట్లాడారు.

'అడ్వకేట్ రాకేశ్ కిశోర్‌ను అరెస్ట్ చేయాలి'

జనగామ రూరల్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడికి యత్నించిన అడ్వకేట్ రాకేశ్ కిశోర్‌ను తక్షణమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ బోడ సునీల్ డిమాండ్ చేశారు. దాడిని ఖండిస్తూ శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్‌ఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో గద్దల కిషోర్ అధ్యక్షత నిర్వహించిన సమావేశంలో సునీల్ మాట్లాడారు. సుప్రీంకోర్టులో విచారణ జరుగుతున్న సమయంలో జస్టిస్‌పై దాడికి యత్నించడం.. ప్రజాస్వామ్య విలువలపై దాడి చేయడమేనన్నారు. సమావేశంలో తాళ్లపల్లి కుమార్, సందేన రవీందర్, సోమరాజు, జేరిపోతుల సుధాకర్, బొట్ల మహేష్, నలిమేల నాగరాజు, గువ్వల రవి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో తాటికొండలో టీజీబీ సేవలు


బ్యాంకు నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్‌ఎం

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తాటికొండ గ్రామంలో అతిత్వరలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు సేవలను అందించనున్నట్లు బ్యాంకు రీజనల్ మేనేజర్ ఆశలత అన్నారు. తాటికొండ గ్రామానికి నూతనంగా తెలంగాణ గ్రామీణ బ్యాంకు మంజూరు కాగా గ్రామంలో బ్యాంకు నిర్మించనున్న స్థలాన్ని ఆర్‌ఎం శుక్రవారం పరిశీలించారు. తాటికొండ గ్రామ ప్రజల కోరిక మేరకు టీజీబీ మంజూరు చేయడం జరిగిందని, నాలుగు నెలల్లో నిర్మాణం చేయించి బ్యాంకును ప్రారంభించేలా కృషి చేస్తామన్నారు. మాజీ వైస్ ఎంపీపీ చల్లా సుధీర్ రెడ్డి, మాజీ సర్పంచ్ చల్లా ఉమాసుధీర్‌రెడ్డి, గ్రామ పెద్దలు ఉమ్మగోని రాజు, పండుగ రాజయ్య, బొంగోని యాదగిరి, మార్క రాజయ్య, గాజుల రమేష్, పండుగ కనుకయ్య, గట్టయ్య, రమేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

హెప్సిబా మార్కెటింగ్ మోసం కేసులో మరో ముగ్గురి అరెస్టు

పాలకుర్తి టౌన్: మండలం కేంద్రంలోని గుడివాడ చౌరస్తా కేంద్రంగా నడుస్తున్న హెప్సిబా మార్కెటింగ్ పేరుతో అధిక వడ్డీ ఆశ చూపి ప్రజల నుంచి రూ.కోట్లు దోచేసిన మోసం కేసులో శుక్రవారం మరో ముగ్గురిని అరెస్టు చేసినట్లు పాలకుర్తి సీఐ జానకిరామ్‌రెడ్డి తెలిపారు. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం గడ్డేపల్లి గ్రామానికి చెందిన తిప్పాల సైదులు 2023లో తన భార్య నారాయణమ్మ పేరుతో హెబ్సిబా ఫర్మ్‌ను రిజిస్టర్ చేయించి ప్రభుత్వం నుంచి అనుమతులు లేకుండా వ్యాపారం ప్రారంభించినట్లు సీఐ తెలిపారు. సైదులు పేరు మీద 80 శాతం, నారాయణమ్మ పేరు మీద 20 శాతం భాగస్వామ్యం కలిగి, ప్రజలచే ఐడీలు కట్టించి భారీగా డబ్బులు సేకరించినట్లు సీఐ చెప్పారు. ఈ నెల 01న సైదులు అతని ముగ్గురు అల్లుళ్లను రిమాండ్‌కు తరలించగా, శుక్రవారం సైదులు భార్య తిప్పాల నారాయణమ్మతో పాటు ఆమె కుమార్తెలు మనుబోతుల శోభ, పాడిలా నాగలక్ష్మీలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

పర్మనెంట్ ఉపాధ్యాయుడిని నియమించాలి

బచ్చన్నపేట: ఎన్నికల కోడ్ పోయినందున అధికారులు మండలంలోని నక్కవానిగూడెం గ్రామ ప్రాథమిక పాఠశాలకు పర్మనెంట్ ఉపాధ్యాయుడిని నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కిష్టయ్య, కళ్యాణి, భవ్య, ఐలయ్య కోరారు. శుక్రవారం వారు మాట్లాడుతూ పాఠశాలకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు ప్రమోషన్‌పై వెళ్లారని, అప్పటి నుంచి వేరే పాఠశాల ఉపాధ్యాయులను డిప్యుటేషన్‌పై పంపిస్తుండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. శుక్రవారం కొన్నె పాఠశాల టీచర్ నాగరాజు డిప్యూటేషన్‌పై పాఠాలు బోధించేందుకు వచ్చారన్నారు.


కోతుల దాడిలో మహిళకు గాయాలు

రఘునాథపల్లి: మండలంలోని ఫతేషాపూర్‌లో కోతుల దాడిలో ఓ మహిళ గాయపడింది. ఏపీకి చెందిన లక్ష్మి భర్తతో కలిసి రైతులకు పరదాలు కిరాయికి ఇస్తూ ఉపాధి పొందుతున్నారు. శుక్రవారం ఆటో స్టాండ్ వద్ద ఉన్న లక్ష్మిపై ఒక్కసారిగా కోతులు దాడి చేశాయి. ఓ కోతి చేతిపై కరవడంతో గాయపడింది. స్థానికులు 108కు సమాచారం అందించి లక్ష్మిని జనగామ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గ్రామంలో కోతులు గుంపులు గుంపులుగా తిరుగుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని, ప్రభుత్వం స్పందించి కోతులను నివారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కుక్కల దాడిలో మేక పిల్లల మృత్యువాత

రఘునాథపల్లి: మండలంలోని పొట్టిగుబ్బటితండాలో వీధి కుక్కలు గుంపులు గుంపులుగా స్వైర విహారం చేస్తున్నాయి. శుక్రవారం తండాకు చెందిన బానోతు జయరాంనాయక్ పాకలోని ఏడు మేక పిల్లలను చంపేశాయి. వీధి కుక్కలు పాకలో చొరబడి చంపేశాయి. బాధిత పెంపకం దారులు రక్తపు మడుగులో మృతి చెందిన మేకలను చూసి కన్నీటి పర్యంతమయ్యారు. మేకల మృతితో రూ.50 వేల నష్టం జరిగిందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు. కాగా, తండాలో వీధుల్లో కుక్కలు తిరుగుతూ గొర్రెలు, మేకలను చంపి వేస్తుండటంతో పాటు, పలువురు మనుషులను కరిచాయని, ఉన్నతాధికారులు స్పందించి వాటి బెడదను నివారించాలని తండా వాసులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి


ఉప్పలయ్య (ఫైల్)

కాజీపేట : కాజీపేట చౌరస్తాలో రోడ్‌క్రాస్ చేస్తున్న వృద్ధుడిని శుక్రవారం ఉదయం అతి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సీఐ సుధాకర్ రెడ్డి కథనం ప్రకారం.. చిల్పూర్ మండలం లింగంపల్లి గ్రామానికి చెందిన వృద్ధుడు కొలిపాక ఉప్పలయ్య (60) రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఉప్పలయ్య అక్కడికక్కడే ప్రాణాలొదిలాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ వివరించారు

వ్యక్తికి రిమాండ్

దేవరుప్పుల: దాడికి పాల్పడి గాయలు చేసిన విషయంలో ఓ వ్యక్తి రిమాండ్ అయినట్టు ఎస్సై ఊర సృజన్‌కుమార్ తెలిపారు. మండలంలోని ధరావత్‌తండా గ్రామ పంచాయతీ పరిధి గోప్యానాయక్ తండాలో ఈ నెల 5వ తేదీన బానోత్ రాహుల్ ఇదే తండాకు చెందిన బానోత్ రమేశ్‌పై దాడికి పాల్పడి తీవ్ర గాయాలు చేయగా కేసు నమోదైంది. ఈ విషయంలో శుక్రవారం రాహుల్‌ను అరెస్టు చేసి జనగామ కోర్టులో హాజరు పర్చగా ఎనిమిది రోజుల రిమాండ్ విధించినట్టు ఎస్సై పేర్కొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

జఫర్‌గఢ్: మండలంలోని హిమ్మత్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు హోప్ ఫర్ లైఫ్ ఫౌండేషన్ నేతృత్వంలో స్వచ్ఛంద సేవకుడు పల్లె రాజిరెడ్డి ఆధ్వర్యంలో పల్లె చిలుకమ్మ కృష్ణారెడ్డిల జ్ఞాపకార్థం స్టడీ మెటీరియల్‌ను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు దాతల సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. హెచ్‌ఎం జయప్రకాష్, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

మోకాళ్లపై తిరుపతి మెట్లెక్కిన అభిమాని

పాలకుర్తి: మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మళ్లీ మంత్రి కావాలని కొండాపురం పెద్ద తండాకు చెందిన బీఆర్‌ఎస్ వీరాభిమాని లావుడ్య శ్రీనివాస్ శుక్రవారం మోకాళ్లపై తిరుమల తిరుపతి కొండ మెట్లు ఎక్కాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దయాకర్‌రావును తిరిగి మంత్రిగా చూడాలని వెంకటేశ్వరస్వామిని వేడుకున్నట్లు తెలిపారు.

'బీఆర్‌ఎస్ నాయకుల వైఖరి సరికాదు'


స్టేషన్‌ఘన్‌పూర్: మాట్లాడుతున్న సతీష్

స్టేషన్‌ఘన్‌పూర్: బీఆర్‌ఎస్ నాయకులు బస్‌భవన్ వద్ద ఆర్టీసీ బస్సులను అడ్డుకునేందుకు ప్రయత్నించడం సరికాదని కాంగ్రెస్ పార్టీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొలిపాక సతీష్ అన్నారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత పదేళ్ల కేసీఆర్ పాలనలో ఆర్టీసీ కార్మికులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నారో ప్రజలందరికీ తెలిసిందే అన్నారు. ఆర్టీసీ కార్మికులు తమ హక్కుల కోసం పోరాడితే ఉద్యోగాల నుంచి తీసేస్తామని బెదిరించారని, ఆర్టీసీని ప్రైవేటు పరం చేసేందుకు యత్నించారని, ఆందోళన చేసిన కార్మికులపై కేసులు పెట్టిన నీచ చరిత్ర బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో ఆర్టీసీ పునరుద్ధరణకు పలు చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటూ ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో మామిండ్ల శ్రీనివాస్, గట్టు కోటేశ్వర్, నక్క పాపయ్య, గట్టు సురేందర్, గట్టు ఎల్లయ్య, శ్రీకాంత్, శ్రీనివాస్, కుమార్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలపై బీఆర్‌ఎస్, బీజేపీలకు చిత్తశుద్ధి లేదు

కొడకండ్ల: బీసీలకు రాజ్యాధికారంపై బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలకు చిత్తశుద్ధి లేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ ఆరోపించారు. శుక్రవారం ఏడునూతులలో క్లస్టర్ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో రాజేష్‌నాయక్, సునీల్‌రెడ్డి, సోమనర్సయ్య, భిక్షపతి, నాగరాజు, వెంకన్న, ఖలీం, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ సవరణతో బీసీ బిల్లును ఆమోదించాలి

జనగామ రూరల్: 9వ షెడ్యూల్‌లో బీసీ బిల్లును చేర్చి రాజ్యాంగ సవరణ ద్వారా ఆమోదించాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా నాయకుడు చిర్ర వీరస్వామి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట టీఆర్‌పీ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దిలీప్, ప్రవీణ్, నరేష్, శంకర్ గౌడ్, విష్ణు, సిరాజ్, జైనేష్, తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి

నర్మెట: రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బాల్నె వెంకటమల్లయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వెంకటేశ్వరాలయంలో కల్లుగీత కార్మిక సంఘం 4వ మహాసభలను మండల అధ్యక్షుడు గోపగోని యాదగిరి అధ్యక్షతన జరుగగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లాకు సర్వాయి పాపన్న పేరు పెట్టాలని, ఖిలాషాపురం కోటను మరమ్మతు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియాను ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గోపగోని సుదర్శన్‌గౌడ, నాయకులు మూల కిరణ్‌గౌడ్, గొల్లపల్లి మురళి, చెక్కిళ్ల వెంకటేశ్వర్లు, మార్క బాస్కర్, బైరు యాదగిరి, బాల్నె కార్తీక్ పలువురు పాల్గొన్నారు.

'బీసీలను మోసం చేస్తున్న ప్రభుత్వం'


మాట్లాడుతున్న నాగేష్‌గౌడ్

జఫర్‌గఢ్: స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ పేరుతో బీసీలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని బీజేపీ మండల అధ్యక్షుడు కోరకొప్పుల నాగేష్‌గౌడ్ పేర్కొన్నారు. బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ప్రభుత్వ వైఖరిపై నాయకులు, కార్యకర్తలు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఎండీ వలిపాష, తొటి సురేష్‌గౌడ్, ఇల్లందుల సారయ్య, నాయకులు రామరాజు, సింగారపు రమేష్, మారపల్లి రవి, సాయిరాం, యాదగిరిగౌడ్, కార్తిక్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

బచ్చన్నపేట: రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేస్తుందని బీజేపీ మండల అధ్యక్షుడు బంగారు మహేష్ అన్నారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. జిల్లా అధికార ప్రతినిధి సద్ది సోమిరెడ్డి, మండల ఉపాధ్యక్షులు జలేందర్, రాపెల్లి చక్రపాణి, నాయకులు భాస్కర్, కుమార్, నరేష్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తాం


అధికారులతో డీఈ లక్ష్మీనారాయణరెడ్డి

బచ్చన్నపేట: వ్యవసాయ బావులకు, పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామని ట్రాన్స్‌కో డీఈ లక్ష్మీనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో అదనపు పీటీఆర్‌ను బిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సబ్‌స్టేషన్‌లో ఇప్పటి వరకు 5 ఎంవీఏ పీటీఆర్ ఉండేదని దానితో పలు కరెంటు సమస్యలు వచ్చియన్నారు. ఇటీవల రైతులు తమ వ్యవసాయ బావుల వద్ద సాగునీటి కోసం బోర్లు వేస్తూ కొత్త మోటర్లను బిగిస్తుండడంతో కరెంటు వినియోగం పెరిగిందన్నారు. పెరిగిన వినియోగానికి తగ్గట్టుగా 8 ఎంవీఏ పీటీఆర్‌ను బిగించామన్నారు. టెక్నికల్ డీఈ గణేశ్, ఎంఆర్‌టీ డీఈ విజయ్‌కుమార్, ఏడీఈ వేణుగోపాల్, శ్రీధర్, ఏఈ రాజ్‌కుమార్, ఏఈటీఆర్‌ఈ కుమార్ ఉన్నారు.